
# నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, ఆదివారం 12 జనవరి 2025 VIKARABAD

డ్రోన్ కెమెరాలను ఉపయోగించి హద్దుల ఏర్పాట్లు
గుట్టుచప్పుడు కాకుండా హద్దురాళ్లను నాటుతున్న అధికారులు

### శాటిలైట్ ఇమేజ్ ద్వారా
# గ్రీన్‌ఫీల్డ్ రూటు..


రంగారెడ్డి, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఫ్యూచర్‌సిటీ కోసం ఏర్పాటు చేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును శాటిలైట్ ఇమేజ్ ద్వారా అధికారులు తయారు చేశారు. పలుచోట్ల డ్రోన్ కెమెరాలను ఉపయోగించి హద్దులను సైతం నిర్ణయించారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డులో విలువైన రైతుల పంటపొలాలు పోయే ప్రమాదం ఉన్నది. శాటిలైట్‌పై ఆధారపడి రోడ్డును తయారు చేయడం వల్ల యాచారం, కడ్తాల్, ఆమనగల్లు, ముద్విన్ వంటి మండలాల్లో భూములు కోల్పోయి రైతులు నష్టపోవాల్సి వస్తున్నది. ఓఆర్ఆర్ కొంగరకలాన్ నుంచి తిమ్మాపూర్, లేమూర్ మీదుగా పంజాగూడ వరకు ఒక రోడ్డును, అలాగే, ఆకుతోటపల్లి నుంచి ముద్విన్, ఆమనగల్లు, కడ్తాల్, యాచారం మండలాల మీదుగా పంజాగూడ వరకు రెండు వైపులా రోడ్డు వేస్తున్నారు. దీంతో రైతులు సుమారు వెయ్యి ఎకరాలను కోల్పోవాల్సి వస్తున్నది. తమ భూములివ్వబోమని రైతులు తెగేసి చెబుతున్నప్పటికీ పోలీసు బందోబస్తు మధ్య సర్వే చేసి, అధికారులు చాటుమాటుగా హద్దురాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. తమ భూములు లాక్కుంటే బతికేదెలా అని రైతులు వాపోతున్నారు.

#### రైతుల గోడును పట్టించుకోని అధికారులు..

వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నామని, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు తమ భూములను బలవంతంగా లాక్కోవడం సరికాదని రైతులు ఆందోళన చేస్తున్నా.. ప్రభుత్వానికి రైతుల గోడు వినిపించడం లేదు. 4 నుంచి 5 బృందాలుగా సర్వే అధికారులు విడిపోయి ఆయా గ్రామాల్లో హద్దురాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. సాగుకు యోగ్యం కాని పొలాల నుంచి రోడ్లను వేయాల్సి ఉన్నప్పటికీ కేవలం శాటిలైట్‌ను నమ్ముకుని రోడ్డును గుర్తిస్తుండడం దారుణమని రైతులు లబోదిబోమంటున్నారు. సాకిబండాతండా, కడ్తాల్ మండలంలోని ఎక్వాయిపల్లి, యాచారం మండలంలోని కుర్మిద్ద సమీపంలోని మంగలిగడ్డతండాలో సర్వే నిర్వహించడానికొచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. రైతులు ఇండ్లకు వెళ్లిన తర్వాత హద్దురాళ్లను ఏర్పాటు చేస్తున్నారు.

#### గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసమే డ్రోన్‌ల కలకలం..

కందుకూరు, యాచారం, ఆమనగల్లు మండలాల్లో కొంత కాలంగా డ్రోన్‌ల కలకలం చర్చనీయాంశంగా మారింది. రాత్రి, పగలు డ్రోన్లు ఎందుకు తిరుగుతున్నాయని ప్రజలకు అర్థం కాలేదు. ఈ డ్రోన్ల కలకలం గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసమే వినియోగిస్తున్నారని ప్రచారం జరుగుతున్నది. హెచ్ఎండీఏ అధికారులు ఇటీవల పంజాగూడ సమీపంలో ఫార్మా బాధిత రైతుల కోసం ఏర్పాటు చేసిన కాలనీలో కూడా డ్రోన్లను వినియోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. డ్రోన్ కెమెరాల ద్వారా సమాచారం తెప్పించుకుని గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్ధారించినట్లు ప్రచారం జరుగుతున్నది.



గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు మ్యాప్



# ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి

> రెండు రైళ్లు ఒకే పట్టాలపై వచ్చినా..
> 30 మీటర్ల దూరంలోనే నిలిచిపోతాయి
> రైళ్లు ఢీకొనే అవకాశమే లేదు
> హైదరాబాద్ మెట్రోలో రక్షణ కవచంగా సీబీటీసీ
> ఒకే ట్రాక్‌పై రెండు మెట్రో రైళ్లు .. వీడియో వైరల్
> సీబీటీసీతో ప్రమాదాలకు ఆస్కారమే లేదని స్పష్టతనిచ్చిన హెచ్ఎంఆర్ఎల్

**సిటీబ్యూరో, జనవరి 11 (నమస్తే తెలంగాణ) :** హైదరాబాద్ మెట్రో రైళ్లు ఒకే పట్టాలపైకి వస్తే ఎలాంటి ప్రమాదం జరుగుతుంది...ఇప్పుడు ఇదే అంశం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన సంఘటనలో రెండు రైళ్లు ఒకే పట్టాలపైకి వచ్చిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఇదే కనుక జరిగితే మెట్రో ప్రయాణం నిజంగా సురక్షితమేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ అలా వచ్చిన సందర్భంలో రెండు రైళ్లు ఢీకొనే అవకాశం ఉంటుందా? ఢీకొడితే ఏ మేరకు ప్రమాదం జరుగుతుంది.? ఇంజన్ ప్రమేయం లేకుండా నిలిపివేసే అవకాశం ఉందా అనే అనుమానాలను నివృత్తి చేస్తూ హెచ్ఎంఆర్ఎల్ వినియోగించిన అధునాతన టెక్నాలజీపై స్పష్టత నిచ్చారు. మెట్రో రాకపోకల సమాచారం ఆధారంగా పని చేసే సాంకేతికత విధానం ద్వారా అసలు ఢీకొనే అవకాశమే లేదని చెబుతున్నారు. అలాంటి సందర్భం ఎదురైనా... రెండు మెట్రో రైళ్ల మధ్య కనీస దూరం 30-50 మీటర్ల దూరం ఉండేలా ప్రయాణిస్తాయని చెబుతున్నారు. దీనికోసం దేశంలోని తొలిసారిగా కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్(సీబీటీసీ) విధానాన్ని వినియోగించినట్లు చెబుతున్నారు. ఈ వ్యవస్థ ద్వారా ఎలాంటి ప్రమాదం ఉండదని, ఢీకొనేందుకు అవకాశమే ఉండదని మెట్రో వర్గాలు చెబుతున్నాయి.

#### దేశంలోనే తొలిసారిగా..

దేశంలోనే తొలిసారిగా ఎలివేటెడ్ కారిడార్ విధానాన్ని పీపీపీ విధానంలో చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టుగా హైదరాబాద్ మెట్రోకు చోటు దక్కింది. అయితే నిర్మాణ దశ నుంచి మెట్రో రైలు పట్టాలెక్కేంత వరకు వినియోగించిన సాంకేతికతపై మొదటి నుంచి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. అసలు మెట్రో రైలు ప్రయాణం సురక్షితమేనా? రెండు మెట్రో రైళ్లు ఢీకొంటాయా.. అనే అనుమానం ఇప్పటికీ ఉంది. కానీ గడిచిన ఏడేండ్లలో ఏనాడూ ప్రమాదాలకు ఆస్కారం లేకుండానే రాకపోకలను మెట్రో సంస్థ నిర్వహించింది. ఇదేలా సాధ్యమనే ప్రశ్నలకు సమాధానంగా... మెట్రో రైల్ రాకపోకలను నియంత్రించే సీబీటీసీ విధానంతోనే వీలు పడుతుందని, దీంతోనే ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా రైళ్ల ప్రయాణం ఉంటుందని చెబుతున్నారు.

#### 30 మీటర్ల దూరంలో ఆగేలా..

సాంకేతిక, మానవ తప్పిదాల దృష్ట్యా ఒకసారి రెండు రైళ్లు ఒకే పట్టాలపైకి వస్తే గనుక ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలనే దానిపై మొదటి నుంచి చర్చ జరుగుతున్నది. ఈ క్రమంలో దేశంలోనే తొలిసారిగా సీబీటీసీ టెక్నాలజీని మెట్రో సంస్థ వినియోగంలోకి తీసుకువచ్చింది. ఉప్పల్‌లోని ఆపరేషన్ కంట్రోల్ సెంటర్ ద్వారా నియంత్రించగలిగే వ్యవస్థను రూపొందించారు. దీని ద్వారా మానవ, యాంత్రిక తప్పిదాలకు తావు లేకుండా మెట్రో రాకపోకలు సాగించే వీలు ఉంటుందని మెట్రో ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఒకవేళ రెండు రైళ్లు ఒకే పట్టాపైకి వచ్చినా.... కనీసం 30 మీటర్ల దూరంలోనే ఆటోమేటిగ్గా నిలిచిపోయేలా గార్డ్ రైల్ టెక్నాలజీ పనిచేస్తుందని చెబుతున్నారు. దీంతో ఏమాత్రం రెండు ఇంజన్లు ఢీకొనే అవకాశం ఉండదంటున్నారు. పీక్ అవర్స్‌లో తక్కువ సమయంలోనే రెండు, మూడు రైళ్లు ఒకే పట్టాలపైకి వచ్చే సందర్భాలను దృష్టిలో పెట్టుకుని మెట్రో రైల్ నిర్వహణ జరిగినట్లు చెబుతున్నారు. ఇదే ప్రయాణికులకు రక్షణ కవచంలా పనిచేస్తుందని, దీంతో రెండు మెట్రో రైళ్లు ఢీకొనకుండా నియంత్రించగలిగే సామర్థ్యం దేశంలోని ఏ మెట్రో రైలుకూ లేదని మెట్రో వర్గాలు పేర్కొన్నాయి. ఎలివేటెడ్ మెట్రో కారిడార్ ప్రమాదాలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన కమ్యూనికేషన్ బేస్డ్ ట్రైన్ కంట్రోల్ వ్యవస్థ అన్ని మెట్రో రైళ్లకు ఆదర్శంగా నిలుస్తుందని ఇటీవల జరిగిన ఓ సమావేశంలో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి కూడా స్పష్టం చేశారు.

## అయ్యో పాపం..
### వేడినీళ్లు మీదపడి చిన్నారి మృతి



శేరిలింగంపల్లి, జనవరి 11: వేడినీళ్లు మీదపడి కాలిన గాయాలతో దవాఖానలో చికిత్స పొందుతూ ఓ చిన్నారి చనిపోయాడు. ఈ సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం...మణికొండ శివపురి కాలనీకి చెందిన మైస రాజు క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య సోనీ, కుమారుడు ధీరజ్‌తో కలిసి నివసిస్తున్నాడు. ఈ నెల 6న రాజు కారు డ్రైవింగ్‌కు వెళ్లాడు. సాయంత్రం భార్య సోనీ స్నానం చేసేందుకు హీటర్‌తో బకెట్‌లో వేడినీళ్లు పెట్టింది. నీళ్లు వేడయ్యాక హీటర్ వైర్ తీసి బాత్‌రూంలో పెట్టేందుకు వెళ్లింది. అదే సమయంలో అక్కడ ఆడుకుంటున్న కుమారుడు ధీరజ్(4) వేడినీళ్ల బకెట్ వద్దకు చేరుకొని వంచడంతో వేడినీళ్లు మీదపడ్డాయి. తీవ్ర కాలిన గాయాలతో విలవిలలాడుతున్న ధీరజ్‌ను.. చికిత్స కోసం నిలోఫర్ దవాఖానకు తరలించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు తరలించారు. ధీరజ్ 60 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



చేవెళ్ల బస్టాండ్‌లో కిటకిటలాడుతున్న జనం

# నరకయాతనగా..
## పండుగ ప్రయాణం!





ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

- సంక్రాంతి పండుగకు సొంత ఊర్లకు వెళ్తున్న జనం
- సరిపడా బస్సులు లేక ఎదురుచూపులు
- ఓవర్ లోడ్ వల్ల బస్సులో నుంచి దించేస్తున్న డ్రైవర్లు
- పురుషులకు తప్పని తిప్పలు
- ప్రైవేటు వాహనాల్లో పల్లెలకు..
- పండుగకు బస్సులు పెంచలేదని సర్కార్‌పై జనాగ్రహం

*పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు వచ్చాయి. పట్టణాల నుంచి పల్లెలకు పయనమవుతున్నారు.. జిల్లావ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండులన్నీ ప్రయాణికులతో రద్దీగా కనిపిస్తున్నాయి. అరకొర బస్సులతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. ప్రయాణికులు అధికం కావడంతో బస్సుల్లో నుంచి ఆర్టీసీ డ్రైవర్లు కిందికి దించేస్తున్నారు. మీ వద్ద లగేజీ ఎక్కువగా ఉంది.. ఇందులో జాగా లేదు.. ఇంకో బస్సులో ఎక్కండి అని సమాధానమిస్తున్నారు. దొరికిన బస్సులో కిక్కిరిసి వెళ్తున్న జనం బస్సులో నరకయాతన అనుభవిస్తుండగా, ఫుట్‌బోర్డు ప్రయాణం చేస్తూ ప్రమాదానికి స్వాగతం పలుకుతున్నారు. కొందరు ఆర్టీసీ బస్సులపై నమ్మకం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రాణాలమీదికొస్తున్నదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పురుషుల పరిస్థితి అయితే మరీ ఘోరం.. బస్సులో సీటు దొరకదు.. ఫుట్‌బోర్డు ప్రయాణం చేయలేదు.. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బస్సుపైన కూర్చుని మరీ ఊర్లకు వెళ్తున్నారు. పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం బస్సులను పెంచాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.*

*- షాబాద్, జనవరి 11*

#### సొంత ఊర్లకు వెళ్లాలంటే తప్పని తిప్పలు..

జిల్లాలోని చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, రాజేంద్రనగర్, ఆమనగల్లు, మహేశ్వరం తదితర నియోజకవర్గాల నుంచి సంక్రాంతి పండుగకు సొంత ఊర్లకు వెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు కిటకిటలాడుతుండగా, పురుషులకు సీట్లు దొరకక అవస్థలు పడుతున్నారు. మరి కొన్ని బస్సుల్లో ఆధార్‌కార్డు నడవకపోవడంతో మహిళలు టికెట్ తీసుకోవాల్సి వస్తున్నది. మామూలు రోజుల్లో సర్దుకుంటామని, పండుగ సమయంలో బస్సులు పెంచకపోవడంతో ప్రయాణికులు రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడుతున్నారు. ఉచిత బస్సు పథకం అమలు చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం.. పండుగ వేళల్లో బస్సులు పెంచాలన్న ధ్యాస లేదా.. అని దుమ్మెత్తి పోస్తున్నారు. ఇప్పటికైనా సంక్రాంతి తర్వాత మూడు, నాలుగు రోజుల వరకు బస్సుల సంఖ్య పెంచాలని జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు.



చేవెళ్ల బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తున్న జనం



#### మధ్యాహ్నం నుంచి బస్సు కోసం చూస్తున్నా..



సంక్రాంతికి సెలవు రావడంతో చేవెళ్ల నుంచి తాండూరుకు వెళ్లేందుకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎదురు చూసినా. ఏ బస్సు చూసినా జనంతో కిటకిటలాడుతున్నది. బస్సు రాగానే జనం ఎగబడుతుండ్రు. తిండి తిప్పలు లేకుండా బస్టాండ్‌లో రోజంతా ఉండాల్సి వచ్చింది. పండుగకు బస్సులను పెంచితే బాగుండేది.

– దివ్య, తాండూరు(చేవెళ్ల టౌన్)

#### చాలీచాలని బస్సులతో ఇబ్బందులు పడుతున్నం..



నా కూతురు చేవెళ్లలోని గురుకుల పాఠశాలలో చదువుతున్నది. పండుగకు సొంతూరు యాచారం తీసుకెళ్లేందుకు వచ్చాను. చేవెళ్ల బస్టాండ్‌లో బస్సులు లేక ఇబ్బందులు పడ్డం. ఇంటికెళ్లేవరకు రాత్రి అయ్యేటట్టున్నది. చాలీచాలని బస్సులతో ఇబ్బందులు పడ్డాం. ప్రభుత్వం బస్సులను పెంచాలి.

– రమాదేవి, యాచారం(చేవెళ్లటౌన్)

#### బస్సుల పోవాలంటే భయం వేస్తున్నది..



ప్రభుత్వం ఉచిత బస్సు పథకం తీసుకొచ్చి.. బస్సులను తగ్గించింది. మహిళలు కిటకిటలాడుతుండడంతో బస్సులో ప్రయాణం చేయాలంటేనే భయం వేస్తున్నది. ఏ బస్సు చూసినా కనీసం నిలబడే సందు లేదు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఫుట్‌బోర్డు ప్రయాణం చేయాల్సి వస్తున్నది. పండుగ సందర్భంగా ప్రభుత్వం బస్సులను పెంచాలి.

– శ్రీనివాస్, దేవుని ఎర్రవల్లి(చేవెళ్లటౌన్)

# చిరు వ్యాపారులు రోడ్డుపాలు..

బండ్లగూడ, జనవరి 11: పొట్ట చేత పట్టుకుని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి చిరు వ్యాపారం చేస్తూ.. జీవనం సాగిస్తున్న వారిపై అధికారులు కొరడా ఝుళిపించారు. తెల్లవారే సరికి వారి డబ్బాలను కూల్చివేయడంతో వారంతా రోడ్డున పడ్డారు. దీంతో వారు తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక కన్నీరుమున్నీరయ్యారు. 20 ఏండ్లుగా తాము ఇక్కడ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రకుంట వద్ద కొన్నేండ్లుగా చిరు వ్యాపారులు వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున కార్పొరేషన్ అధికారులు వచ్చి ఎర్రకుంట వద్ద ఉన్న డబ్బాలను తొలగించారు. ముందస్తుగా సమాచారం ఇస్తే సామగ్రిని తీసుకునే వారమని ఆవేదన చెందారు.

#### మా ప్రాణాలు పోయేవి : రేణుక

ఎర్రకుంట వద్ద హైదర్షాకోట్ గ్రామానికి చెందిన రేణుక భర్త చనిపోవడంతో పంక్చర్ దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నది. ఆమె తన ముగ్గురు పిల్లలతో కలిసి రాత్రి అక్కడే నిద్రించింది. ఒక్కసారిగా తెల్లవారుజామున జరిగిన అలజడికి ఆమె బయటకు వచ్చి చూసే సరికి ఆమె ఉన్న డబ్బా పక్కనే ఉన్న డబ్బాను తొలగించడం కనిపించింది. దీంతో ఆమె అరుపులు విన్న అధికారులు ఆమెకు ఒక రోజు సమయం ఇచ్చి వెళ్లిపోయారు. తనకు మేలుకువ రాకపోతే తాము ఇప్పటికే చనిపోయేవారమని రేణుక రోదించింది.

#### మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు...

అధికారుల చర్యలతో జీవనోపాధి కోల్పోయిన బాధితులకు అండగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిలిచారు. కార్పొరేషన్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎర్రకుంట వద్దకు వచ్చి బాధితులతో కలిసి నిరసన తెలిపారు. అధికారులు కాంగ్రెస్ నాయకుల చేతిలో కీలు బొమ్మలుగా మారి.. ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది కాంగ్రెస్ నాయకులు కావాలనే అధికారులతో కలిసి ఇలాంటి చర్యలకు పాల్పడి ఉండవచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి వెంట కార్పొరేటర్ రవీందర్ రెడ్డి,మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఎర్రకుంట వద్ద తెల్లవారుజామున డబ్బాల తొలగింపు
బాధితులకు అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు

